కర్ణాటక బేహాగ్ - ఝుంప

పసిడీ యక్షంతలివె -పట్టరో వేగమే రారో
దెసల బేరటాండ్లు - దేవుని పెండ్లికిని

శ్రీవేంకటేశ్వరునికి - శ్రీమహాలక్ష్మికిని
దైవికపు బెండ్లి ముహూ - ర్తము నేడు
కావించి భేరులు మ్రోసె - గరుడ ధ్వజంబెక్కె
దేవతలు రారో - దేవుని పెండ్లికిని

కందర్ప జనకునికి - గమలాదేవికి బెండ్లి
పందిరి లోపల - దలబాలు నేడు
గందమూ విడె మిచ్చేరు - కలువడాలు గట్టిరి
అందుక మునులు రారో - హరి పెండ్లికిని

అదె శ్రీవేంకటపతి - కలమేలు మంగకును
మొదలి తిరునాళ్లకు - మొక్కేమునేడు
యెదుట నేగేరు వీరె - యిచ్చేరు వరములివె
కదలిరారో పరుష - ఘనుల పెండికిని

శ్రీవేంకటేశ్వరునికి కళ్యాణానికి ముహూర్తం నిశ్చయమైంది. నేడే సుమూహూర్తం. (నేడే కళ్యాణ ముహూర్తం అన్న మాటలో నిత్య కళ్యాణం ఆ స్వామికి అన్న ధ్వని) వధూ వరులు అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులు. పెండ్లి పిలుపుల పురస్సరంగా పదకవితా పితామహుని శ్రీవేంకటేశ్వర కళ్యాణోత్సవాహ్వాన శుభలేఖార్థం ఈ సంకీర్తన. పెండ్లిపిలుపు - ఆహ్వానం దిక్పాలకుల పురంధ్రులకు దెసల పేరంటాండ్లకు - అష్టదిక్కులా ఉన్న ముత్తై దువలకు ముచ్చటైన పిలుపు.

కళ్యాణముహూర్త సూచనగా భేరులు మ్రోగాయి. మంగళతూర్య ఘోషలు సాగాయి. వేదమంత్రాలు చెలరేగాయి. గరుడ ధ్వజం - టెక్కెపు కంభం ధ్వజస్తంభం ఎక్కి రెపరెప లాడింది. దిక్పాలకులూ, సతులూ, దేవతలూ, దేవేరులూ అందరూ సువర్ణాక్షతలు జల్లవలె రారండి.

మన్మధుని కన్నతండ్రికీ, మా లావణ్యవతికీ ఉద్వాహం - పందిరిలోపల - శ్రీవేంకటే శ్వరుని కళ్యాణమందిరంలో - తలంబ్రాలుపోసే వేడుకవేళయిది. కలువడాలు కట్టడమైనది. ఆహూతులందరికీ చందన తాంబూల సత్కారం మదర్పిత చందన తాంబూలాది సత్కారాలు స్వీకరించమని సంకీర్తనాచార్యుల పిలుపు మునులందరికీ.

అదిగో అలమేల్మంగా శ్రీవేంకటేశ్వరులు, కళ్యాణానంతరం ఊరేగుచున్నారు. ఈ ప్రధమోత్సవానికై మ్రొక్కుతున్నాము మేమంతా. కళ్యాణపు వేడుకలలో అంతర్భాగంగా కోరి నవారికి కోరినవెల్లా కొసరి కొసరి - వరదానమిస్తున్నారు జగజ్జననీ జనకులు. చేతనా చేతనమైన జగత్సర్వమూ ఈ జగత్కల్యాణాన్ని దర్శించ కదలిరమ్మనీ, అలమేల్మంగా శ్రీవేం కటేశ్వరుల కృపనుపొంది, ధన్యులై, అభీష్టప్రాప్తి జెందమనీ పెండ్లిపెద్ద, జగత్కల్యాణ కార్యకర్త, సంకీర్తనాచార్యులు, పదకవితాపితామహుడు, ఆంధ్రవేదస్రష్ట అన్నమాచార్యులు ఉల్లేఖింపజేసిన శుభలేఖ వివరం. శ్రీవారి కల్యాణ దర్శనప్రాప్తి ఈ శుభలేఖ అందిన వారందరికీ సిద్ధించుగాక.